andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.3, కనిష్ఠం 19.4

ఆంధ్రజ్యోతి



నిజామాబాద్
జిల్లా వార్తలు

5 సోమవారం 5 ఫిబ్రవరి 2024



జిల్లాలో విద్యాసంస్థల దోపిడీ!

- కమర్షియల్‌గా కార్పొరేట్ విద్య
- జిల్లాలో చాపకిందనీరులా విస్తరిస్తున్న వైనం
- అనుమతులు లేకుండానే అడ్మిషన్ల వేట
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 4: జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలు చాపకింద నీరులా విస్తరిస్తుండటంతో ప్రైవేటు విద్య మధ్యతరగతి వారికి అందని ద్రాక్షలా మారుతోంది. రెండు రూములు ఉంటే చాలు ప్రైవేటు స్కూల్, నాలుగు గదులుంటే కళాశాల పెట్టేయవచ్చని దానికి ఉన్నతాధికారుల సహకారం ఉంటే చాలు అమాయకపు తల్లిదండ్రులను మోసం చేయవచ్చునని జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు కుప్పలు తెప్పలుగా పుట్టుకొస్తున్నాయి. ఇదివరకు మహానగరాలకే పరిమితమైన కార్పొరేట్ విద్యాసంస్థలు సైతం జిల్లా కేంద్రాల్లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఎలాంటి వసతులు లేకున్నా అనుమతులు తెచ్చుకొని అమాయకపు ప్రజలను మోసం చేస్తున్నాయి. కమర్షియల్ భవనాల్లో పాఠశాలలు, కళాశాలలు పెట్టవద్దని నిబంధనలు ఉన్నా అవేమి పట్టనట్లు ఎలాంటి వసతులు లేకున్నా బోర్డులు పెట్టేసి విద్యాసంస్థలను ప్రారంభిస్తున్నారు. విద్యాసంవత్సరం ఇంకా ప్రారంభంకాకుండానే కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించాయి. విద్యాసంవత్సరం పూర్తయిన నూతన విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే వరకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభంచవద్దనే నిబంధనలు ఉన్నా కార్పొరేట్ విద్యాసంస్థలు అవేమి పట్టనట్లుగా నిబంధనలను అతిక్రమించి అడ్మిషన్ల ప్రక్రియ మొదలుపెట్టడం విశేషం. మూసి ఉన్న పాఠశాలలను లీజ్‌కు తీసుకుని కొత్తగా తమ బ్రాండ్‌లను తగిలించి జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలు తమ ఉనికిని ప్రారంభిస్తున్నాయి. మూసిఉన్న లేదా గుర్తింపు రద్దయిన పాఠశాలలకు తిరిగి అనుమతులు పొంది గుట్టుచప్పుడుకాకుండా కార్పొరేట్ విద్యాసంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రంతో పాటు ఆర్మూర్, బోధన్ పట్టణాలలో ఇప్పటికే కార్పొరేట్ విద్యాసంస్థలు గుట్టచప్పుడుకాకుండా తమ పాఠశాలల అడ్మిషన్ల వేట ప్రారంభించగా విద్యాశాఖ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడంలేదు. అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలకు వ్యతిరేకం గా విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు చర్యలకు వెనకాడుతున్నారు.

అనుమతులు లేకుండానే అడ్మిషన్లు

విద్యాసంవత్సరం ప్రారంభంకాకుండానే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించవద్దనే నిబంధనలు ఉన్న కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ఇప్పటికే వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించాయి. నిబంధనల ప్రకా రం ఏదైనా గుర్తింపు పొందిన పాఠశాలలో ఆ పాఠశాల పేరు మీదే అడ్మిషన్లు నిర్వహించాల్సి ఉన్న కొ న్ని కార్పొరేట్ విద్యాసంస్థలు వాటి పేర్లతో అడ్మిషన్ల ను నిర్వహిస్తున్నారు. నగరంలోని గంగస్థాన్ ప్రాంతంలో ఓ అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాల పక్కనే రేకుల షెడ్డు వేసి అదనపు తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల ఆ పాఠశాలపై పక్కన ఉన్న అపార్ట్‌మెంట్ వారు ఫిర్యాదు చేయగా అధికారులు చర్య లు తీసుకోవడం లేదు. గంగాస్థాన్-2 ప్రాంతంలో ఓ అద్దె భవనంలో నూతన పాఠశాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పైన నివాస గృహం, గ్రౌండ్ ఫ్లోర్‌లో పాఠశాలను ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమైన అధి కారులు మాత్రం అటువైపు చూడటం లేదు. ఆర్మూర్, బోధన్ ప్రాంతాల్లోను కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వేలల్లో ఫీజులు.. ఫీజుల కోసం ఒత్తిళ్లు

ట్రస్టు పేరుతో పాఠశాలలను ఏర్పాటు చేస్తేనే ప్రభుత్వం నుంచి గుర్తింపు వస్తుంది. అలా గుర్తింపు పొందిన పాఠశాల తప్పనిసరిగా గవర్నింగ్‌బాడిని ఏర్పాటు చేయాలి. ట్రస్టు చైర్మన్, కరస్పాండెంట్, హెచ్‌ఎం, టీచర్, పేరెంట్స్‌తో గవర్నింగ్‌బాడి నియమించి ఏ తరగతులకు ఎంత ఫీజు అనేది నిర్ణయించాల్సి ఉంటుంది. అర్హత కలిగిన ఉపాధ్యాయులను నియమించుకుని వారి వేతనాలను గవర్నింగ్‌బాడి నిర్ణయించాలి. ఎక్కడా కూడా ఈ ప్రక్రియ ప్రైవేట్ విద్యాసంస్థల్లో కనిపించడంలేదు. గుర్తింపు పొందిన పాఠశాల పేరుమీదనే కార్యకలాపాలు జరగాల్సి ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థలు ఆ గుర్తింపును కొనుక్కుని తమ కార్యకలాపాలకు ఆ పాఠశాలలను వినియోగిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే చాలా వరకు కార్పొరేట్ విద్యాసంస్థలు ఇదివరకే మూసి ఉన్న పాఠశాలలు, ఉనికిని కోల్పోయిన ప్రైవేట్ పాఠశాలల గుర్తింపులను కొనుక్కుని తమ పాఠశాలలను ప్రారంభించాయి. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లోను కొంతమంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలి కానీ అవేమీ పట్టనట్లుగా ధనార్జనే ధ్యేయంగా కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులను వసూలు చేస్తూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు..

: ఎస్‌వీ దుర్గాప్రసాద్ (డీఈవో)

జిల్లాలో ఇంకా విద్యాసంవత్సరం ప్రారంభం కాలేదు. ఎవరైనా వచ్చే విద్యాసంస్థరానికి అడ్మిషన్లు తీసుకుంటే మా త్రం చర్యలు తీసుకుంటాం. కార్పొరేట్ విద్యాసంస్థలు తప్పనిసరిగా విద్యాశాఖ అనుమతి తీసుకోవాలి. అలా అనుమతులు లేకుండా ఏర్పాటు చేసే విద్యాసంస్థల విషయంలో తల్లిదండ్రులు ఆలోచించి విద్యార్థులను చేర్పాలి. అన్ని అనుమతులు ఉన్న పాఠశాలల్లో మాత్ర మే విద్యార్థులను చేర్పించాలి. అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం.



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు

మానవ సంబంధాలకు జీవం పోస్తున్న 'ఇందూరు యువత'

- మానవ విలువలు కాపాడుకోవాలి
- యువత పాశ్చాత్య పోకడలను అనుకరించవద్దు
- విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 4: రోజు రోజుకూ మానవ సంబంధాలు అంతరించిపోతున్న నేటి సమాజంలో వాటికి జీవం పోస్తూ స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు చేస్తూ యువతకు ఇందూరు యువత వ్యవస్థాపకుడు మద్దుకూరి సాయిబాబు ఆదర్శవంతుడని విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఏర్పాటుచేసిన "మనశ్శాంతి కోవెల" నవలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ.. నేటి తల్లిదండ్రులు తమ సంతానం విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు చేయాలని, బాగా డబ్బు సంపాదించాలని కోరుకుంటున్నారు తప్ప ఉన్నచోటనే వృద్ధిలోకి వచ్చి కన్నవారితోపాటు తోటివారికి తోడ్పడాలని కోరుకోకపోవడం ఆందోళనకరమన్నారు. అక్కడ తమ పిల్లలు విదేశాల్లో స్థిరపడితే ఇక్కడ వారి తల్లిదండ్రులు అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో తమ అవసానకాలంలో గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు పాశ్చాత్య అలవాట్లు వదిలివేయాలని అవి మన సంస్కృతి, సంప్రదాయాలకు సరితూగవని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు ఇవ్వడంతోపాటు వారికి తోచినంత సమాజానికి కూడా ఇవ్వడం నేర్పాలి. అనాథలు, వృద్ధులు, అన్నార్థులను తమ సేవా కార్యక్రమాల ద్వారా సాయిబాబు తోడ్పాటునందించడం అభినందనీయమన్నారు. ప్రముఖ కవి నాళేశ్వరం శంకర్, డాక్టర్ కాసర్ల నరేష్‌రావు, ఘనపురం దేవేందర్‌లు మాట్లాడుతూ.. డాక్టర్ మద్దుకూరి సాయిబాబ మనశ్శాంతి కోవెల నవల ద్వారా సమాజంలోని వ్యక్తుల మనస్తత్వాలను కళ్లకు కట్టినట్లు చూపాడన్నారు. మానవ సంబంధాలను మతం వాడుకోవడం ఆందోళనకరమన్నారు. కలుషితమైన మనసులను మానవత్వంతో కడిగిపారేయాలన్నారు. దేశానికి శీలాన్ని కాపాడేవాడే కేవలం పేదవాడేనని ప్రముఖ కవి కొడవగంటి కుటుంబరావు అన్నారని గుర్తుచేశారు. మాత్రమేనన్నారు. ఈ నవలలో సమాజంలోని మనుషుల స్వభాలను మూడు పాత్రల ద్వారా రచయిత చెప్పడం సమర్థవంతంగా ఉందని ప్రశంసించారు. కరోనా కాలంలో అనాథలకు అన్నదానం చేయడం, అనాథ శవాలను వారి సంప్రదాయాల ప్రకారం అంతిమ సంస్కారాలు చేయడం తనకు ఎంతో తృప్తినిచ్చిందని నవలా రచయిత సాయిబాబ తెలిపారు. ఒక్కడితో 13 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఇందూరు యువత నేడు 280 మంది సభ్యులు తోడయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు డాక్టర్ కాసర్ల నరేష్‌రావు, ఘనపురం దేవేందర్, డాక్టర్ వంగర త్రివేణి, డాక్టర్ అమృత లత ఉన్నారు.



- నూత్‌పల్లి, జీజీ నడ్కుడ గ్రామాల మధ్య గుంతలుగా మారిన రోడ్డు

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

డొంకేశ్వర్, ఫిబ్రవరి 4: మండలం నూత్‌పల్లి, జీజీ నడ్కుడ గ్రామాల బీటీ రోడ్డు గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 3.5 కిలోమీటర్ల మేర రోడ్డు అంతా గుంతల మయంగా ఉంది. అక్కడక్కడ బీటీరోడ్డుపై కంకరతేలి పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణి కులకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డుపై వాహనాలు ప్రయాణించేటప్పుడు ఎక్కువ సమయం పడుతుందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం వ్యవసాయ పనుల నిమిత్తం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తారు. నూత్‌పల్లి కమన్ నుంచి జీజీ నడ్కుడ కమన్ వరకు 3.5కిలో మీటర్లు గుంతలు ఏర్పడడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు వెంట ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ప్రయా ణికులు ప్రమాదాల బారీన పడుతున్నారు. చిన్నయానం, గాదేపల్లి, నడ్కుడ, అన్నారం, సిర్పూర్ గ్రామాల ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం గుంతల రోడ్డుపై వెళ్ళలంటే కార్లు, ద్విచక్ర వాహన దారులు ఎక్కడ వాహనాలు చెడిపోతా యోనని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారిని వివరణ కోరగా 3.5 కిలోమీటర్ల రోడ్డు మంజూరు అయ్యిందని ఈ రోడ్డుకు రూ.3కోట్ల 77లక్షలు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులను ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ రఘు తెలిపారు.



అసంపూర్తిగా గ్రంథాలయం

- అసంపూర్తిగా గ్రంథాలయ అదనపు గదుల నిర్మాణం
- స్లాబ్ వేసి రెండున్నర నెలలు గడిచినా తొలగించని సెంట్రింగ్
- నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని కోరుతున్న పాఠకులు



- స్లాబ్ సెంట్రింగ్ తొలగించని దృశ్యం

నవీపేట, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలో కొనసాగుతున్న శాఖ గ్రంథాలయ భవనంపైన చేపడుతున్న అదనపు గదుల నిర్మాణ పనులు అసంపూర్తిగా మిగిలాయి. గ్రంథాలయ భవనం చిన్నదిగా ఉండడంతో పుస్తకాలు భద్రపర్చుకోవడానికి, పాఠకులు కూర్చుండి చదుకోవడానికి సరైన వసతులు లేవు. దీంతో గత సంవత్సరం జిల్లా గ్రంథాలయ శాఖ నవీపేటలో అదనపు గదుల నిర్మాణానికి 30లక్షల రూపాయల నిధులు మంజూరు చేసింది. దీనిలో భాగంగా 5-10-2023 రోజున అప్పటి బోధన్ ఎమ్మెల్యే షకీల్ అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అదనపు గదుల నిర్మాణ పనులను కాంట్రాక్టర్ చేపట్టగా 21-11-2023 రోజున మొదటి అంతస్తులో చేపట్టిన అదనపు గదుల నిర్మాణానికి స్లాబ్ వేయడం జరిగింది. స్లాబ్ వేసి రెండున్నర నెలలుగా గడిచిపోయిన దానికి సంబంధించిన సెంట్రింగ్‌ను ఇప్పటికి తొలగించలేదు. గ్రంథాలయంలో బోరు లేకపోవడంతో ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చి ఐదు రోజుల పాటు క్యూరింగ్ చేసి పనులను మధ్యలోనే నిలిపివేశారు. స్లాబ్ వేసిన 15 రోజుల్లో సెంట్రింగ్ తొలగించి, స్లాబ్ పైభాగం, కింది భాగంలో పైపు ద్వారా క్యూరింగ్ చేసినట్లయితే భవనం నాణ్యతగా ఉండేది. సంబంధిత కాంట్రాక్టర్ బిల్లులు రాలేదన్న నెపంతో పనులను మధ్యలోనే నిలిపివేసి కనీసం స్లాబ్ సెంట్రింగ్ తొలగించకపోవడం పట్ల పాఠకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన భవన నిర్మాణ పనుల్లో క్యూరింగ్ సరిగ్గా లేకపోతే భవిష్యత్తులో భవనానికి పగుళ్లు ఏర్పడే అవకాశం ఉంటుందని పాఠకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తిచేయాలని పాఠకులు కోరుతున్నారు.

బిల్లులు రాక.. పనుల్లో జాప్యం

: అత్తర్, సోషల్ వెల్ఫేర్ ఏఈ


నవీపేట గ్రంథాలయంలో 30లక్షల రూపాయల వ్యయంతో మొదటి అంతస్తులో అదనపు గదుల నిర్మాణ పనులు చేపట్టడం జరిగింది. దీంట్లో భాగంగా కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. స్లాబ్ వేసి రెండున్నర నెలలు గడిచిన మాట నిజమే. సంబంధిత సెంట్రింగ్‌ను వెంటనే తొలగించడానికి తగిన చర్యలు తీసుకుంటాం.



- శిథిలావస్థలో 'లక్ష్మికాలువ' వంతెన
- భయాందోళనలో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రమాదకరంగా వంతెన

ముప్కాల్, ఫిబ్రవరి 4: మండల కేంద్రం నుంచి మెండోరకు వెళ్లే మార్గంలోని లక్ష్మీకాలువపై నిర్మించిన పురాతనమైన వంతెన ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పురాతనమైన బ్రిడ్జి కావడంతో ఎత్తు తగ్గిపోయి సైడ్‌వాల్ రోడ్డుకు సమానంగా ఉండి ప్రమాదానికి నెలువైంది. లక్ష్మీకాలువ నిర్మాణ సమయంలో నిర్మించిన ఈ వంతెన రోడ్డు ఎత్తు పెరిగి లో లెవల్ వంతెనగా మారి శిథిలావస్థకు చేరింది. గతంలో ముప్కాల్ నుంచి మెండోరకు బీటీరోడ్డు వేసిన సమయంలో వంతెన నిర్మించకుండా రోడ్డు పనులు చేపట్టారు. దీంతో రోడ్డు వెడల్పుగా ఎత్తు పెరిగి వంతెన ఇరుకుగా మారింది. వంతెన బీటలు వారి సైడ్‌వాల్ దిమ్మెలు దెబ్బతిన్నాయి. ముప్కాల్ బైపాస్ నుంచి మెండోర, సావెల్, నాగంపేట, రెంజర్ల, వెంచిర్యాల్, ఎల్కటూర్ గ్రామాలకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నారు. గత సంవత్సరం సెప్టెంబరులో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రూ.కోటి 95లక్షలతో రోడ్డు పునరుద్ధరణకు శంకుస్థాపన చేశారు. కానీ బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు కేటాయించలేదు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల అవసరాలను తెలుసుకొని నిధులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.



- ప్రమాదకరంగా వంతెన

ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై వీగిన అవిశ్వాసం

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 4: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. పండిత్ వినీత పవన్ తిరిగి చైర్‌పర్సన్‌గా కొనసాగనున్నారు. ఈ మేరకు ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 4వ తేదీన మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై తోటి కౌన్సిలర్‌లు అవిశ్వాసం ప్రవేశ పెట్టారు. మున్సిపల్‌లో 36మంది కౌన్సిలర్‌లు ఉండగా ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఎక్స్ అఫిషియో సభ్యునిగా సమావేశానికి హాజరయ్యారు. దీంతో సభ్యుల సంఖ్య 37కు చేరింది. మున్సిపాలిటీలో 36 కౌన్సిలర్‌లు, ఒక ఎమ్మెల్యే ఉండడంతో 37మంది సభ్యులుగా నమోదు చేశారు. 37మంది సభ్యులకు గాను అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 25మంది సభ్యులు తీర్మానంపై ఓటు వేయాల్సి ఉండగా 24మంది కౌన్సిలర్‌లు చేతులెత్తారు. ఎమ్మెల్యే ఓటు వేయలేదు. దీంతో అధికారులు అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు తీర్మానించారు. అయితే అవిశ్వాస తీర్మానానికి ఎంత మంది సభ్యులు ఉండాలన్నది అధికారుల్లో స్పష్టత లేకపోవడంతో కొన్ని రోజులుగా చైర్‌పర్సన్ పదవి ఎవరికి దక్కుతుందోనని ఉత్కంఠ నెలకొంది. శనివారం రాత్రి మున్సిపల్ పట్టణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ ఉత్వర్వులు జారీ చేయడంతో పండిత్ వినీత యాథావిధిగా మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కొనసాగనున్నారు.

డొంకేశ్వర్‌కు బస్సు నడిపించాలి

డొంకేశ్వర్, ఫిబ్రవరి4: ఆర్మూర్ నుంచి డొంకేశ్వర్ మండల కేంద్రానికి బస్సు సౌకర్యం వెంటనే ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మారంపల్లి గంగాధర్ కోరారు. ఆర్మూర్ నుంచి వన్నెల్(కె) గ్రామం మీదుగా మారంపల్లి, గంగాసముందర్, అన్నారం, సిర్పూర్ గ్రామా లను కలుపుకొని డొంకేశ్వర్ మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించా లన్నారు. డొంకేశ్వర్ మండలానికి 15రోజులుగా బస్సు నడిపించి మధ్యలోనే ఆపివేశారని, మళ్లీ యాథావిధిగా బస్సును పునరుద్దరించాలని ఆర్టీసీ అధికారులను చర్యలు తీసుకోవాలన్నారు.. ఆర్టీసీ అధికారులకు పలుమార్లు బస్సు నడపాలని విన్నవించుకున్న ఫలితం లేకుండా పోయింది. ఇప్పటి కైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సును నడపాలని ఆయన కోరారు.

నేటి కేటీఆర్ ప్రోగ్రాం వాయిదా

డిచ్‌పల్లి,ఫిబ్రవరి4: డిచ్‌పల్లి మండల కేంద్రంలో నిజామాబాద్ రూరల్ బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమా వేశం నేడు జరగాల్సి ఉండగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు సమయ భావం వలన రద్దు చేసినట్లు మండల బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు

గాంధీనగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

డిచ్‌పల్లి,ఫిబ్రవరి4:మండలంలోని నడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల గాంధీనగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కోరుతు న్నారు. గ్రామంలో అమ్మవారి దేవాలయం ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, నిరుపేదలైన వారికి ఇళ్లు ప్రభుత్వం తరుపున మంజూరు చేయించాలని, అంగన్ వాడీ భవనం నిర్మిం చాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే భూపతి రెడ్డిని గ్రామస్థులు కోరారు. ఈకార్యక్రమంలో గ్రామస్థులు సంతోష్,విజయ్,శ్రీనివాస్, కృష్ణ, యేసు, పాల్గొన్నారు.

ఏర్గట్ల మాజీ సర్పంచ్ భర్త మృతి

ఏర్గట్ల, ఫిబ్రవరి 4:ఏర్గట్ల గ్రామ తాజా మాజీ సర్పంచ్ గుల్లె లావణ్య భర్త గుల్లె గంగాధర్ ఆదివారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ముంబైలో ఆది వారం మృతి చెందారు. గుల్లె గంగాధర్ బీఆర్ఎస్ పార్టీలో మా జీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి చురుగ్గా పని చేశారు.ఈఘటనతో మండల కేంద్రంలో విషాదఛాయలు అలు ముకున్నాయి.

అందరి సహకారంతోనే అభివృద్ధి

ధర్పల్లి, ఫిబ్రవరి 4: అందరి సహకారంతోనే గుడితండా గ్రామపంచాయతీని అభివృద్ధి చేశామని తాజామాజీ సర్పంచ్ లింబ్యానాయక్ అన్నారు. ఆదివారం గ్రామపంచాయతీ ఆవరణలో మాజీ స ర్పంచ్ లింబ్యానాయక్, ఉపసర్పంచ్ ఎందియానాయక్, వార్డు సభ్యులను గ్రామస్థులు సన్మానించారు. ఈసందర్భంగా లింబ్యానాయక్ మాట్లాడుతూ మొదటిసారిగా గుడితాండ గ్రామపంచాయతీ అయి నప్పటికి తండావాసుల సహకారంతో అభివృద్ధి చేశామన్నారు. రూ.20లక్షలతో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఏర్పాటు చేసుకుని తాండలో సీసీరోడ్లు వేశామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి బాలకృష్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కారు ద్విచక్ర వాహనం ఢీ..ఒకరి మృతి

బోదన్ రూరల్, ఫిబ్రవరి 4: బోధన్ మండలం చిన్నమావంది-కొప్పర్గ రోడ్డులో ఆదివారం రాత్రి కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. బికెనెల్లి గ్రామానికి చెందిన సంతోష్ (40) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడని బోధన్ రూరల్ ఎస్ఐ నాగ్‌నాథ్ తెలిపారు. బికెనెల్లి గ్రామానికి చెందిన సంతోష్ చిన్న మావంది వెళ్లి తిరిగి బికెనెల్లి వైపు తిరిగి వస్తున్నారని పేర్కొ న్నారు. కారు కొప్పర్గ నుంచి నిజామాబాద్ వైపు వెళుతుండగా ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిందన్నారు. ఈ ఘటనలో సంతోష్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందడంతో పంచనామా నిర్వహించి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నా మన్నారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుం టున్నామ న్నారు. పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

ఆలయంలో చోరీ

కోటగిరి,ఫిబ్రవరి4: కోటగిరి మండల కేంద్రంలోని అభయ బసవేశ్వర ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీని దొంగలించారు. ఆలయంలో హుండిలో సుమారు 5వేల రూపాయల నగదు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

ప్రశాంతంగా గురుకుల కళాశాల ప్రవేశ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్సీవో,ప్రిన్సిపాల్

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 4:తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతి భ కళాశాల ఇంటర్ ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష (సీవోఈ సెట్-2024) ప్రశాంతంగా జరిగింది. నిజామాబాద్ జిల్లాలో 6పరీక్ష కేంద్రా ల్లో ఈ పరీక్ష జరిగిందని ధర్మారం(బి) గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సంగీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్షకు 504 మంది విద్యార్థులు నమో దు చేసుకొగా 494మంది పరీక్ష కు హాజరయ్యారని, 10మంది గైర్హా జరయ్యారని ప్రిన్సిపాల్ తెలి పారు. నిజామాబాద్ 6పరీక్ష కేంద్రాల్లో 2747 మంది విద్యార్థులకు గాను 2659 పరీక్షకు హాజరయ్యారని, ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ధర్మారం(బి)పరీక్ష కేంద్రాన్ని ఆర్సీవో పరి శీలించారు.

7న కబడ్డీ సబ్‌జూనియర్ బాల,బాలికల ఎంపికలు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 4: సబ్‌జూనియర్ అండర్-16బాలబాలికల కబడ్డీ ఎంపికలు ఈనెల 7వ తేదిన నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆందియాల లింగయ్య తెలిపారు. ముప్కాల్ మండల కేంద్రంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడకారులు ఉదయం 9.30గంటల వరకు క్రీడామైదానానికి చేరుకోవాలన్నారు. బాలికలు 55కీలోల బరువు ఉండాలని, 20-3-2008సంవత్సరంలో జన్మించి ఉండాలన్నారు. మిగత వివరాల కోసం 9440355999ను సంప్రదించాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ జయప్రదం చేయండి

● ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాచకొండ విఘ్నేశ్



వర్సిటీలో విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు విఘ్నేశ్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 4: ఫిబ్రవరి 24,25వ తేదీల్లో రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ తెలంగాణ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ బిల్డింగ్ జరుగుతోందని ఈకార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాచకొండ విఘ్నేశ్ ఆదివారం తెలిపారు. వర్సిటీ ఎస్ఎఫ్ఐ సభ్యులతో కలిసి ఆయన యూనివర్సిటీలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసంద ర్భంగా మాట్లాడుతూ..ఈ కన్వెన్షన్‌లో రాష్ట్ర యూనివర్సిటీల అభివృద్ధిపై ప్ర ధాన చర్చ ఉంటోందని తెలిపారు. సమావేశానికి ముఖ్యవక్తలుగా ప్రొ. కోదం డరాం, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ లింబాద్రి, పలు వర్సిటీల వైస్ చాన్స్‌ల ర్లు హాజరవు తున్నారని పేర్కొన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో వర్సిటీ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సంధ్య, దినేష్, పవన్, పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ ప్రవేశ గడువు పెంపు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 4: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ 2023-24 విద్యాసంవత్సరంనకు గాను డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు పరీక్ష ఫీజులు చెల్లించడానికి గడువును ఈ నెల 16 వరకు పొడగించినట్లు మెట్‌పల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విద్యాలయం కోఆర్డినేటర్ బిల్లా రాజేందర్, అకాడమిక్ కౌన్సిలర్ కడకుంట్ల దశరథం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం నేరుగా ప్రవేశానికి ఇంటర్ పాస్ లేదా అందుకు సమానమైనటువంటి ఇంటర్మీడియట్ నేషనల్ స్కూల్ మరియు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటి ఆంధ్రప్రదేశ్ ఓపెన్‌స్కూల్ సొసైటీ, పాలిటెక్నిక్ మూడు సంవత్సరాల కోర్స్ మరియు ఐటిఐ, డూరి ఒకేషనల్, ఓఎ, ఈఈటి వంటి కోర్సులు పాసైనవారు డిగ్రీ మొదటి సంవ త్సరం ప్రవేశానికి అర్హులని పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ ఆర్ట్స్ మరియు కంప్యూటర్ గ్రూప్‌లలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశం పొందుటకు ఈ నెల 16 లోపు ఫీజులు చెల్లిచుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 7569841724 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

వీడీసీ చెప్పిందే శాసనం

● గ్రామాల్లో పెరిగిపోతున్న వీడీసీల ఆగడాలు ● చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ప్రజలను ఇబ్బందులను గురి చేస్తున్న వీడీసీ సభ్యులు
● సర్పంచ్ ఉన్న వీడీసీ చెప్పినా మాటానే ఫైనల్ ● జిల్లా వ్యాప్తంగా ఒకే నెలలో 5 గ్రామాల్లో గ్రామ బహిష్కరణ ఘటనలు



డిచ్‌పల్లి తహసీల్దార్ ఎదుట కోరట్‌పల్లి, మైలారం వీడీసీ సభ్యులు బైండోవర్(ఫైల్)



రాంపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 4: భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు దాటింది. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా మన రాజ్యంగాన్ని అభివర్ణిం చుకుంటాం గానీ ఇప్పటికీ కొన్ని గ్రామాల్లో చట్టాన్ని తుంగలో తొక్కి గ్రా మాభివృద్ధిల పేరిట ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటనలు జిల్లాలో రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఒకే నెల పరిధిలోనే జిల్లాలో సుమారు 5 గ్రామాల్లో వీడీసీ సభ్యులు కొందరు కుటుంబాలను బహి ష్కరణ సంఘటన జరిగాయి. దీని బట్టి గ్రామాల్లో వీడీసీల ఆధిపత్యం ఏ విధంగా జరుగుతుందో అద్దంపడుతుంది. ప్రజాస్వామ్య దేశంలో ప్రజా ప్రతినిధులను ఓటు హక్కుద్వార ఎన్నుకుంటాం. గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు ఉన్న వీడీసీ సభ్యులదే పెత్తనం జరుగుతోంది. వీడీసీలు కులాలపై ఆధిపత్యం చెలాయించడం, వారు చేసిన పనులకు మరియు వారి కులవృత్తులకు రేటు నిర్ణాయించడం, గ్రామాల్లో ఏదైనా వ్యాపారం చేసుకుంటే ఏటా డబ్బులు వీడీసీలకు చెల్లించడం జరుగు తోంది. కూల్‌డ్రింక్స్, బెల్ట్ షాపులను గ్రామాల్లో ఏర్పాటుకు ప్రోత్సహిస్తు వారి వద్ద నుంచి లక్షలాది రూపాయలు వేలం పాట ద్వారా సంపాదించి గ్రామాల వీడీసీ సభ్యులు గ్రామ అభివృద్ధి పేరుతో జల్సాలకు పాటుపడు తున్నారు. గ్రామంలోని మొరం, ఇసుక లాంటి వ్యాపారాలు టెండర్‌ల ద్వారా వ్యాపారాలు చేసి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సామాన్యులకు ఎలాంటి అవకాశాలు దక్కుకుండా కొందరి చేతుల్లోకి చట్టాని తీసుకొని గ్రామాల్లో నిబంధనలు పెడుతున్నారు. ఇటీవల ధర్పల్లి మండలంలోని దుబ్బాక గ్రామంలో ఓపద్మశాలి కుటుంబానికి చెందిన సాగు భూమిని గ్రామంలో పశువుల మేపకం కోసం ఇవ్వాలని వీడీసీ సభ్యులు కోరడం ఆ కుటుంబం అందుకు తిరస్కరించడంతో కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ వీడీసీ సభ్యులుచేశారు. అదే విధంగా డిచ్‌పల్లి మండలంలోని రాంపూర్ గ్రామంలో ఓచికెన్ సెంటర్ నిర్వాహణకు ఏడా దికి రూ.3లక్షల వీడీసీకి చెల్లించాలని డిమాండ్ చేయడం ఆ నిర్వాహకుడు దానికి అంగీకరించకపోవడంతో ఆయనను గ్రామంలో సాంఘిక బహి ష్కరణ చేశారు. ఆబాధితుడు పోలీసులను ఆశ్రయిం చాడు. జక్రాన్‌పల్లి మండ లంలో రజకులను సాంఘిక బహిష్కరణ చేయడంతో ఆ ఘటన సై తం పోలీస్‌లకు ఫిర్యాదు అందింది. గత ఏడాది డిచ్‌పల్లి మండలం దూ స్‌గాం గ్రామంలో దళితులు, గ్రామ వీడీసీ మధ్య వివాదం చెలరేగింది. ఆ విషయంలో అప్పటి ఆర్డీవో, ఏసీపీ, తహసీ ల్దార్‌లు గ్రామంలో ప్రజల తోనే గ్రామంలో మాట్లాడి సమస్య ను పరిష్క రించారు.

● వ్యాపారం చేసుకుంటే డబ్బులు ఇవ్వాల్సిందే

గ్రామాల్లో ఎవరైనా తమ సొంత వ్యాపారాలు చేసుకుంటే వీడీసీలకు ఏటా డబ్బులు చెల్లించాలిలేదంటే వారివ్యాపారం మూసివేస్తారు. లేదంటే సాంఘిక బహిష్కరణ చేస్తారు. గీత కార్మికులు కల్లుబట్టీల ద్వారా తమ వ్యాపారాలు చేస్తే గ్రామ వీడీసీలకు ఏటా డబ్బులు చెల్లించాలి లేదంటే జరిమానాలు విధిస్తారు.బెల్ట్‌షాపులు, కూల్ డ్రింక్స్, కోడి గుడ్ల వ్యాపారం ఇలా అన్ని రంగాల్లో వీడీసీ ల అధిపత్యం కొనసాగిసిస్తున్నారు.

● చట్టాన్ని చేతులోకి తీసుకుంటున్న వీడీసీలు

ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ద్వారా గ్రామాల్లో సర్పంచ్, ఎంపీ టీసీలు, వార్డు సభ్యులు ఉన్న వారందరిని నామామాత్రంగా చేసి వీడీసీలు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తూ ప్రజలను స్వేచ్చను హరిస్తున్నారు.

చట్టాన్ని అతిక్రమించొద్దు

గ్రామాల్లో అభివృద్ధి పేరిట ఏర్పడిన వీడీసీ సభ్యులకు చట్ట బద్ధం గా ఏటువంటి గుర్తింపులేదని ప్రజల స్వేచ్ఛను ఏవరు హరిం చ రాదని అలాంటి సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమా చారం ఇవ్వాలి. చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- డిచ్‌పల్లి,ఎస్సై మహేశ్

సిరికొండలో ఇసుక అక్రమ రవాణా

సిరికొండ ఫిబ్రవరి 4: ఆదివారం వచ్చిందంటే గ్రా మాభివృద్ధి కమిటీ సభ్యులకు పండుగగా మారింది. సి రికొండ మండలంలో ఆదివారం వచ్చిందంటే గడ్కోల్, కొండూర్, మైలారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుకు పండుగగా మారింది. ఎందుకంటే అధికారులు ఎవరి ఇళ్లల్లోకి వారు వెళ్లి పోతారు తమ పని తాము స్వేచ్ఛ గా చేసుకోవచ్చనే పండుగగా గ్రామాభివృద్ధి కమిటీ స భ్యులకు కలుగుతోంది. ప్రభుత్వానికి ఇసుక డబ్బులు చెల్లించకుండానే విక్రయించుకోవచ్చనే సంబరపడుతు న్నారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గడ్కోల్, కొండూర్ గ్రామాల నుంచి ఇసుకను అక్రమం గా సిరికొండూర్‌కు తరలించారు. ప్రభుత్వానికి ఎలాం టి రాయల్టీని(పన్నులు)చెల్లించకుండా ట్రాక్టర్ల యజ మానులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.దీని వల్లప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం వాటిల్లుతోందని ప లువురు అభిప్రాయపడుతున్నారు. సిరికొండ మండలం లోని గడ్కోల్, కొండూర్ గడ్కోల్ గ్రామాల నుంచి ట్రా క్టర్ల యజమానులు పోలీస్,రెవెన్యూ అధికారుల అండ గా విచ్చల విడిగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా రు. ఇదేమిటని ప్రశ్నిస్తే తాము ఎమ్మెల్యే మనుష్యుల మని బెదిరిస్తున్నారు.అధికారులు మాత్రం ఇసుకను అ క్రమంగా తరలించే వారికి సంపూర్ణ మద్దతుగా ఉండ



ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

డం వల్ల ఎవరేం చేస్తారో చేసుకొండని ట్రాక్టర్ల యజ మానులు విర్రవీగుతున్నారు.ఆదివారం ఉదయం నుం చి స్వేచ్ఛగా ఇసుకను తరలిస్తున్న రెవెన్యూ, పోలీస్ అ ధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.ఈ విష యంలో ఎవరు ఫోన్లు చేసిన సమాచారం అందించిన పోలీస్ అధికారులు గాని రెవెన్యూ అధికారులు స్పం దించిన పాపాన పోలేదు. ఒక వేల స్పందించిన తమ కేమి సంబంధం లేదన్నట్లు సమాధానం ఇవ్వడం దా రుణంగా ఉంది. ప్రభుత్వానికి ఆదాయం సమాకూర్చే ఇసుక అక్రమ రవాణాను పట్టించుకోక పోవడం వల్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వందాలాది ట్రిప్పుల ఇసుకను ట్రాక్టర్ల యజమానులు అమ్ముకుం టే అధికారులు అమ్ముకుంటే ప్రభుత్వానికి వచ్చే ఆదా యానికి అధికారులే గండి కొట్టడం అంత మంచిది కా దని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఇదే విషయం లో పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించక పోవ డం చాలా బాధాకరమని గడ్కోల్, కొండూర్ గ్రామ యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్‌కు ఫోన్ చేసిన స్పందించక పోవడం వల్ల ఉపతహసీల్దా ర్ ప్రవీణ్ కుమార్‌కు ఫోన్ చేస్తే స్పందించారు. కొం డూర్,గడ్కోల్ గ్రామాల వారికి తాము ఎలాంటి ఇసుక పర్మిట్లను ఇవ్వలేదని చెప్పారు. అక్రమంగా ఇసుకను తరలించే వారిపై కేసులు నమోదు చేయాలని పోలీస్ అధికారులను కోరుతున్నాట్లు ఆయన చెప్పారు. ఈ విషయంలో తమకెలాంటి సంబంధం లేదని పోలీస్ అ ధికారులు చెపుతున్నారు. ఏదిఏమైనా అమ్యామ్యాలకు ఆశపడిన రెవెన్యూ, పోలీస్ అధికారుల వల్ల రాష్ట్ర ప్ర భుత్వానికి వేలాది రూపాయల అర్థికనష్టం చేకూర్చిన వారయ్యారు. ఇదే విషయలాన్ని ఎస్సై రమేష్ దృష్టికి తీసికెళ్లగా పై రెండు గ్రామాల నుంచి ఇసుకను తరలి స్తున్నట్లు తెలియదని తప్పించుకున్నారు. గ్రామాల నుంచి ఫిర్యాదులు అందితే మాత్రం కఠిన చర్యలు తీ సుకుంటామని మాత్రం సమాధానం చెప్పి ఎస్సై చేతు లు దులుపుకున్నారు.

మహిళ సాధికారిత కేవలం బీజేపీతోనే సాధ్యం

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ



మాట్లాడుతున్న ధన్‌పాల్‌సూర్యనారాయణ

ఖిల్లా , ఫిబ్రవరి 4 : మహిళ సాధికారిత కేవలం బీజేపీతోనే సాధ్యమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణ అన్నారు. ఆదివారం బీజేపీ మహిళ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన శక్తివందన్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ స్త్రీజాతి స్వేచ్ఛ, సమానత్వం హక్కుల కోసం మహిళల సాధికారిత కోసం అనాది కాలం నుంచి ఎన్నో ఉద్యమాలు అణచివేతలు చూస్తువస్తున్నా మని అన్నారు. అలాంటి మహిళలకు అన్ని రంగాల్లో అభివృద్ధి పదంలో నడిం పచడం ఒక బీజేపీతోనే సాధ్యమన్నారు. మహిళ సాధికారిత అంటే ఒక రోజు మహిళ దినోత్సవం పేరుతో గౌరవించి మరుసటి రోజు వారిని పట్టించు కోక పోవడం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలను అందిస్తుందన్నారు.ఉచిత గ్యాస్‌సిలిండర్లు, జన్‌ధన్‌అకౌంట్, స్వచ్ఛభారత్ కింద మరుగుదొడ్లు నిర్మాణం, ముద్రలోన్, సుకన్య సమృద్ధి యోజన, పోషక్‌మహా ఇలాంటివి అనేక సంక్షేమ పథకాలు బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తుందన్నా రు.ఈకార్యక్రమంలో తెలంగాణా శక్తిఅభియాన్ ఇన్‌చార్జీ ఆకులవిజయ, జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, మహిళ మోర్చా పార్లమెంటు ఇంచార్జీ స్రవంతి రెడ్డి,నాయకులు భోగశ్రావణి, ప్రవళిక,పల్లెగంగారెడ్డి,పెద్దోళ్లగంగారెడ్డి ఉన్నారు.

బొమ్మతుపాకీతో విద్యార్థుల హల్‌చల్

ఖిల్లా , ఫిబ్రవరి 4 : నగరంలో కొందరు విద్యార్థులు బొమ్మతుపాకి (లైటర్ గన్‌తో) హల్‌చల్ చేసిన ఘటన ఐదవ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని మినీ ట్యాంక్ వద్ద శనివారం రాత్రి జరిగింది. విద్యార్థులు గంజాయి సేవించి ఉన్న ట్లు స్థానికులు తెలిపారు. రాత్రివేళల్లో నగర ప్రజలు సేదదీరడానికి వచ్చే వా రిని భయభ్రాంతులకు గురి చే సే అవకాశాలు ఉండడంతో ప్రజలు భయప డుతున్నారు. పోలీసులు గట్టిబందోబస్తు చర్యలు చేపట్టాలని వారు కోరుతు న్నారు. నగరంలో బొమ్మతుపాకీలతో యువకులు హల్‌చల్ చేస్తూ ఇతరులను భయపెట్టిన ఘటనలు ఇదివరకు ఎన్నో జరిగినా పోలీసులు చూసిచూడన ట్లుగా వ్యవహరించడంతో అవి రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు ఆక తాయి యువకుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు. బొమ్మతుపాకితో మినిట్యాంక్ బండ్‌పై హల్‌చల్ చేసిన విద్యా ర్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి సీరియస్ వార్నింగ్ ఇచ్చి వదిలివేసినట్లు సమాచారం.

చేపలు పట్టడానికి వెళ్లి జాలరి మృతి

నవీపేట,ఫిబ్రవరి4: నిజామాబాద్ మండలం పాల్దాకు చెందిన మెట్‌పల్లి చిన్న బాబన్న(48)అనే జాలరి చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు వా గులో మునిగి మృతి చెందాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. ఆదివా రం ఉదయం స్థానిక పెద్ద వాగులో బాబన్న చేపలు పట్టడానికి వెళ్లాడని, వాగులో కాళ్లకు నాచు చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎ స్ఐ వివరించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చే సుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు పిచికారీలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



అజాగ్రత్తగా పురుగులమందు పిచికారి చేస్తున్న రైతు



పురుగుల మందు పిచికారిలో జాగ్రత్తలు పాటిస్తున్న రైతులు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 4: పంటపొలాలకు పురుగులు, గడ్డిమందులు పిచికారి చేసేసమయాల్లో ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వ్యవసా యశాఖ అధికారులు సూచిస్తున్నారు.మందుల పిచికారిలోజాగ్రత్తలు పా టించకపోతే ప్రాణాలకు ప్రమాదం ఉంటోందని అన్నారు. మందులపిచి కారి చేసేసమయంలో చేతులకు గ్లౌజులు వేసుకోవాలని, మొఖానికి ము క్కును కప్పుకునే విధంగా మాస్కులతోగాని టవల్‌తోగాన కప్పుకోవాల న్నారు.మందు పిచికారి సమయాల్లో చేతులు పైకెత్తి స్ప్రే చేయాల్సివ స్తుంది. ఈ కారణంగా క్రిమిసంహారకమందులు శరీరంపైపడే అవకాశం ఉంటోందని ఈవిషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.పురుగు మందుల డబ్బాలను నోటితో తీయరాదని, చేతులకో కలవద్దని, పిచికారి సన్నగా పడేవిధంగా చూసుకోవాలని సూచిస్తున్నారు. మందుపచికారి స మయంలో ఏదైనా తినడంగాని, తాగడం, పొగతాగడంగాని చేయకూడ దని, గాయాలున్న చేతితో స్ప్రే చేయొద్దని, పిచికారి పూర్తికాగానే మందు డబ్బాను ఎవరు తిరగనిచోట పడవేయాలి.లేదా పాతిపెటాలని పనిపూర్తి కాగానే ఇంటికివెళ్లి స్నానంచేయడంతో పాటే స్ప్రేచేస్తున్న సమయంలో వేసుకున్నదుస్తులకు క్రిమిసంహారక మందు పడవచ్చు జాగ్రత్తగా ఉతుక్కోని తగుజాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు,కూలీలకు వ్యవసా యాధికారులు సూచలు చేస్తున్నారు.

రైతాంగ సమస్యలపై ఉద్యమాలు చేద్దాం

● అఖిల భారత రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 4 : దేశంలో నేడు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పెద్ద ఎత్తున రైతాంగ ఉద్యమాలను చేద్దామని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. ఆది వారం బోధన్ పట్టణంలోని తాలూక రైస్‌మిల్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ బోధన్ ప్రాం తంలో మన సంఘం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ఫ్యాక్టరీ భూములను ప్లాంటేషన్ కార్మికులకు ఇవ్వాలనిడిమాండ్‌చేశారు. సింగూరు నీళ్ల ఇం దూరు హక్కు అని పేర్కొన్నారు. తెలంగాణ సాధనకై మలిదశ ఉద్యమంలో ముందుండి పోరాటం చేశామని, ఉద్యమ సమయంలో చేసి న వాగ్దానాలు అమలు చేయకపోగా తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువ లను లేకుండా చేస్తే ఆ పార్టీనే తెలంగాణ ప్రజలు బొందపెట్టారన్నారు. ఇప్పుడు తెలం గాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

బీజేపీ పార్టీ కార్పొరేట్‌కు అనుకూలంగా రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, దేశంలో రైతు ఐక్య ఉద్యమాలను చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సురేష్, గంగాధర్, నాయ కులు గంగాధర్, నాగన్న, పార్వతి, రాజేశ్వర్, పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, మల్లేష్, సీతారాం, గంగారాం, సలీం, శంకర్, బాలయ్య, నాగమణి తదితరులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

నేటి నుంచి 'గావ్ చలో అభియాన్'

ఖిల్లా, ఫిబ్రవరి 4: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి 8వ తేదీ వరకు గావ్ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి తెలిపారు. ఆదివారం పార్టీ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉన్న నాయకులు 24గంటల పాటు పల్లె, నగరాల్లో పర్యటించాలన్నారు. రాబోయే లోకసభ ఎన్నికల్లో 51శాతం ఓట్లు సాధించడమే లక్ష్యంగా కార్యకర్తలను, పార్టీని పటిష్ఠం చేయడానికి ఈ కార్యక్రమం చేపట్టడడం జరగిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో గావ్‌చలో అభియాన్ జిల్లా కన్వీనర్ స్వామియాదవ్, కో కన్వీనర్ సందిప్‌కుమార్, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా మీడియా ఇన్‌చార్జి జస్వంత్ తదితరులు పల్గొన్నారు.

రాష్ట్ర జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో ఛాంపియన్‌గా జిల్లా జట్టు

సుభాష్‌నగర్ , ఫిబ్రవరి 4: రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో జిల్లా జట్టు చాంపీయన్‌గా నిలచింది. ఈనెల 3, 4తేదీల్లో మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగిన రాష్ట్ర పోటీల్లో తుది పోటీల్లో ఆదిలాబాద్ జట్టుపై 7-0పరుగుల తేడాతో గెలుపొంది చాంపీయన్‌గా నిలచింది. చాంపియన్‌గా నిలవడం పట్ల జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్‌లు జిల్లాకు చెందిన క్రీడా సంఘాలు హర్షం వ్యక్తం చేశారు.

పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుబ్యాంక్ పెంచాలి

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 4: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటుబ్యాంక్ పెంచాలని, 51 శాతానికి మించి ఓట్లు సాధించడమే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని జీవీ నర్సింహారెడ్డి సూచించారు. ఆదివారం ముబారక్‌నగర్‌లో రూరల్‌మండల బీజేపీ గావ్‌చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి జీవీ నర్సింహారెడ్డి కార్యకర్తలకు, బాధ్యులకు దిశానిర్ధేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తల అకంఠిత దీక్ష, పట్టుదలతోనే మెజార్టీ ఓట్లు సాధించగలిగామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో అదే స్ఫూర్తిని చాటాలని కోరారు. ప్రధాని మోడీ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కేంద్ర నిదుల నుంచి చేపడుతున్న పనులను అర్థమయ్యేలా వివరించాలనాన్నరు. సమావేశంలో బీజేపీ రూరల్ కన్వీనర్ పద్మారెడ్డి, సందీప్, ఆనంద్‌కుమార్, మహేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై ధ్యాన కార్యక్రమం


సిద్దులగుట్టపై పిరమిడ్‌లో ధ్యానం చేస్తున్న దృశ్యం

పెర్కిట్, ఫిబ్రవరి 4: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం వద్ద ఆనంద ఆదివారం ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ పిరమిడ్ మాస్టర్ హైదరాబాద్ నుంచి విచ్చేసిన ధ్యాన దర్శనం వ్యవస్థాపకుడు రాము మాస్టర్ ధ్యానులకు ఆత్మజ్ఞానాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దులగుట్టపై గల పిరమిడ్‌లో ధ్యానం చేసి జ్ఞానం పొందాలని ప్రతీఒక్కరు ధ్యానం చేస్తూ శాఖ ఆహారం భుజిస్తూ ఆనందంగా గడపాలని మంచి పుస్తకాలు చదువుతూ భగవద్గీత చదివి ఆచరించాలని అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ధ్యానులకు నిజామాబాద్ పట్టణానికి చెందిన స్వరూప వెంకటేష్ దంపతులు ధ్యానామృతం అందించారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్‌రెడ్డి, పీఎస్ఎస్ఎం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సాయి కృష్ణరెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నల్ల గంగారెడ్డి, ఆర్డీవో బావయ్య, కునింటి శేఖర్‌రెడ్డి, బొడ్డు దయానంద్, అమరవాజి శ్రీనివాస్, పెంబర్తి నారాయణ, రాజారాం బోబిడె గంగామోహన్, నాగంపేట శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, నర్సయ్య, ప్రవీణ్‌కుమార్, ధ్యానులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

● ఇద్దరికి గాయాలు

బోధన్ రూరల్, ఫిబ్రవరి 4: బోధన్ పట్టణంలోని సాత్‌పూల్ వద్ద శుక్రవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. ఇష్తేకార్ అహ్మద్ అనే వ్యక్తికి తలకు, కాళ్ళకు బలమైన గాయాలయ్యాయని, ప్రీతమ్ అనే వ్యక్తికి సైతం గాయాలయ్యాయన్నారు. హబీబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు


కబడ్డీలో తలపడుతున్న నిజామాబాద్, కమ్మర్‌పల్లి జట్టు

మెండోర, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలో యువ యూత్ ఆధ్వర్యంలో బుట్టడి వినోద్ స్మారక రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఆదివారం రెండో రోజు హోరాహోరీగా కొనసాగాయి. ఈ సందర్భంగా వాలీబాల్‌లో ఖమ్మం, కోరుట్ల మధ్య జరిగిన సెమీఫైనల్‌లో హోరాహోరీ మ్యాచ్‌లో కోరుట్ల జట్టు ఫైనల్‌కి చేరింది. మరో సెమీఫైనల్ తాడ్వాయి, గన్నరం మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో తా డ్వాయి జట్టు ఫైనల్‌కి చేరింది. కబడ్డీ మ్యాచ్‌లో నిజామాబాద్, మెండోర, సుర్బిర్యాల్, తాళ్లరాంపూర్ జట్లు సెమీఫైనల్‌కి చేరాయి. ఈ కార్యక్రమంలో వ్యా యామ ఉపాధ్యాయులు పింజ సురేందర్, శ్యామ్, చారి, భూపతి, రమణ, ప్రేమ్, క్రీడాకారులు పాల్గొన్నారు.


వాలీబాల్‌లో తలపడుతున్న ఖమ్మం, కోరుట్ల జట్లు

ముగిసిన ఆలయ వార్షికోత్సవం


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న జడ్పీ చైర్మన్


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నవీపేట, ఫిబ్రవరి 4: మండలంలోని యంచలోని శ్రీ ఓం జగదాద్రి ఆలయంలో కొనసాగుతున్న ఆలయ 5వ వార్షికోత్సవ ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు, అభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు యంచ గోదావరిలో చక్రతీర్థం నిర్వహించారు. గత 10రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాసర వేద భారతి పీఠం వ్యవస్థాపకులు శ్రీ వేద విద్యానందగిరి స్వామి ఆధ్వర్యంలో శిష్య బృందంచే వేదమంత్రోచ్ఛరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఓం జగదాద్రి ఆలయ వ్యవస్థాపకురాలు స్వర్ణ కమల లక్ష్మి, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, మానికేశ్వర్ రావు, రమణ రావు, నాగారావు, మనోహర్ రావు, ప్రవీణ్ కుమార్‌లతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.


వాహనదారులకు సూచనలు ఇస్తున్న ఎస్సై

మైనర్ల డ్రైవింగ్‌పై కఠిన చర్యలు : ఎస్సై

ధర్పల్లి, ఫిబ్రవరి 4: మైనర్ల డ్రైవింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వంశీకృష్ణరెడ్డి హెచ్చరించారు. ఆదివారం నంబర్‌ప్లేట్లు లేని వాహనాలు, సైలెన్సులు, డ్రైవింగ్‌లైసెన్సులు లేని వాహనాలను పోలీసులకు తరలించారు. ఈ సందర్భంగా యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నంబరు ప్లేట్లు లేని వాహనాల వల్ల దొంగలు వాటిని చోరీ చేసి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. దీంతో పాటు ఇతర నేరాలు చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్లు వినియోగించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్లలో మాట్లాడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 4: మున్సిపల్ శివారులోని మామిడిపల్లి పరిధి శివారు యానంగుట్ట వద్ద రోడ్డు ప్రమాదంలో జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ గ్రామానికి చెందిన మహీవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు జక్రాన్‌పల్లి నుంచి ఆర్మూర్ వైపు బైక్‌పై వస్తున్న మహీవర్ధన్ అతని స్నేహితుడు వస్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టడడంతో మహీవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందగా అతని స్నేహితునికి తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు.

నూతన కార్యవర్గం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి4: ప్రెస్‌క్లబ్ మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షునిగా తలారి అశోక్, గౌరవ అధ్యక్షునిగా బింగి శ్రీనివాస్, ఉపాధ్యక్షునిగా చిట్యాల గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా బిగంగాధర్, కోశాధికారిగా నట్ట తిరుపతి, సహాయకార్యదర్శిగా బాజన్న, లిగల్ అడ్వయిజర్‌గా దికొండ కిరణ్, అడ్వయిజర్‌గా సుంకరి సాగర్, సంయుక్త కార్యదర్శులుగా నవీన్, రొడ్డ రమేష్, మారుపాక రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మార్పు అంటే మంజూరైన అభివృద్ధి పనులను రద్దు చేయడమేనా ?

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి 4: కాంగ్రెస్ ప్రభుత్వం మార్పు తీసుకువస్తామని చెబుతోందని మార్పు అంటే ఇదీ వరకు మంజూరు అయిన అభివృద్ధి పనులను రద్దు చేయడమేనా అని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో తాను మంత్రిగా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కూలి పనుల కోసం గల్ఫ్ వెళ్లడమే గాకుండా టెక్నికల్ పనుల ద్వారా వెళ్లి మంచి వేతనం పొందాలనే ఆలోచనతో రెండు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కొక్క దానికి రూ.5కోట్లు వెచ్చించి ఏర్పాటు చేయాలని న్యాక్ ద్వారా మంజూరు చేశామన్నారు. కలెక్టర్ భూమిని కేటాయించాలని తాను శంకుస్థాపన చేయగా టెండర్‌లు పూర్తి చేశామన్నారు. ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఎలక్ట్రికల్, ప్లంబింగ్, రాడ్ బెండింగ్, ఇంటిరియల్ విభాగాల్లో ప్రతీఏడు సుమారు రెండు వేల మంది నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి న్యాక్ ద్వారా వారికి సర్టిఫికెట్‌లు అందజేసి వారికి మంచి వేతనాలతో ఉద్యోగం పొందే అవకాశం కల్పించాలన్నదే తమ ప్రయత్నమన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను రద్దుచేసి నిరుద్యోగ యువత అవకాశాలను దెబ్బతీసే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం కక్ష్యపూరిత వైఖరిని ఖండించారు. మోర్తాడ్‌లో మొదలు పెట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను యాథావిధిగా కొనసాగించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వ హయంలో తన ద్వారా మంజూరై ఇంక ప్రారంభించని అనేక అభివృద్ధి పనులను ప్రభుత్వం రద్దు చేయాలని చూస్తోందని ఆయన పేర్కొన్నారు. మంజూరైన అభివృద్ధి పనులు యాథావిధిగా కొనసాగించడానికి ఆయా గ్రామాల్లోని యువకులు, కుల సంఘాలు, వీడీసీలు, ప్రజాప్రతినిదులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు.

కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయం

● కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 4: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం రావడం ఖాయమని జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఎల్లారెడ్డి మండలంలోని కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి కార్యకర్తలు ప్రజలకు వివరించాలని పార్లమెంట్ ఎన్నికలలో జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలుపునకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని, గతంలో జరిగిన లోపాలను వచ్చే ఎన్నికల్లో జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. ప్రభుత్వాల వైఫల్యం గురించి గతంలో చేసిన పార్టీల అవకతవకల గురించి ప్రజలకు వివరించాలని ఆయన అన్నారు.


సీవోఈ పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రశాంతంగా ముగిసిన సీవోఈ ప్రవేశ పరీక్ష

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 4: మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సీవోఈ (సెంట్రల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉన్నత విద్య చదువుల కోసం నిర్వహించే ఈ ప్రవేశ పరీక్షకు 248 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 232 మంది హాజరైనట్లు, 16 మంది గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ మీనాక్షి తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్ మీనాక్షి మాట్లాడుతూ సీవోఈ పదవ తరగతి పూర్తయిన విద్యార్థులు తరువాత చదువుల కోసం ఈ ప్రవేశ పరీక్ష ఉంటుందని మీనాక్షి తెలిపారు. ఈ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



నసురుల్లాబాద్, ఫిబ్రవరి 4: నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చెరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహా పంక్తి భోజనాలు చేశారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

పండరిపూర్‌కు పాదయాత్రగా వెళ్లిన భక్తులు

గాంధారి, ఫిబ్రవరి 4: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పండరిపూర్‌కు భక్తులు ఆదివారం గాంధారి భోగేశ్వర ఆలయం నుంచి పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణం ఎల్లప్పుడు అనుకూలంగా ఉంటూ పంటలు బాగా పండాలని ప్రతీ సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా పండరిపూర్‌కు భక్తులు బయలుదేరి పాదయాత్రగా వెళ్లారు. వీరికి మార్గమధ్యలో వివిధ గ్రామాల ప్రజలు అల్పాహారంను ఏర్పాటు చేస్తూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాజులు, కారోబార్ మూర్తి, రమేష్‌రావ్, మోహన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల శిలాఫలకం ధ్వంసం



భిక్కనూరు, ఫిబ్రవరి 4: మండలంలోని కాచాపూర్ గ్రామ ంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన శిలా ఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తు లు శనివారం రాత్రి ధ్వంసం చేసినట్లు మాజీ ఎంపీపీ తోగరి సుదర్శన్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల శిలాఫలాకాన్ని ధ్వంసం చేయడం సిగ్గుచేటని, దీనికి కారణమైన వారిని పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ముగిసిన గీతా జ్ఞానయజ్ఞం ఉత్సవాలు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 4: మండల కేంద్రం శివారులోని పాటిహనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఆదివారం గీతా జ్ఞాన యజ్ఞం ముగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్లోకాల పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందజేశారు. మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 15 రోజులపాటు 75వ గీతా జ్ఞాన యజ్ఞ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ గీతా ప్రభోదక్ గీతాసత్సంగ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిలమంతుల ఛత్రపతి ఆధ్వర్యంలో 108 ఫలహారాతలో శ్రీకృష్ణుడికి నైవేద్యం సమర్పించారు. ఆదివారం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై గీతాసత్సంగ్ ముగింపు ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,600	రూ.59,500	రూ.760

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 :అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (12.20,6.50)
: ఫైటర్ (హిందీ 3డీ) (3.15,9.45)
స్ర్కీన్-2 : ఫైటర్ (హిందీ 3డీ) (11.45)
: హనుమాన్ (తెలుగు) (3.20, 6.40, 10.00)
స్ర్కీన్-3 :అర్గిలీ(ఇంగ్లీష్)(11.00,7.45)
:గేమ్‌ఆన్(2.05)
: ధీర (5.05)
:అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (10.50)
స్ర్కీన్-4 :కిస్మత్ (10.10,7.15)
: బూట్‌కట్‌బాలరాజు (1.00)
:హ్యాపీఎండింగ్ (4.05)
: ధీర (10.05)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (10.30,1.30, 4.30, 7.30, 10.30)
స్ర్కీన్-2 : ధీర (10.45,7.20)
:గేమ్‌ఆన్(1.25)
:హ్యాపీఎండింగ్ (4.30)
:బూట్‌కట్‌బాలరాజు (10.20)
స్ర్కీన్-3 : హనుమాన్ (1.30,4.30,7.30,10.30)

దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : గుంటూరుకారం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కిస్మత్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ :అంబాజీపేట మ్యారేజీబ్యాండ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్